

## ● మంత్రికి వినతి

ఎర్రగడ్డ నుంచి హైటెక్ సిటీ వరకు 100 ఫీట్ల రోడ్డును నిర్మించాలని రెసిడెన్సీ వెల్ఫేర్ జేఏసీ కన్వీనర్ వెంకట నరసింహారావు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. జేఏసీ కమిటీ సభ్యులు రాహుల్, గంగాధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్యాంప్రసాద్, హనుమంతరావు, నరేష్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి)

## చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు

● కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికలో చట్ట వ్యతిరేక పనులు చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ మహేశ్వరి అన్నారు. ఈ మేరకు శనివారం బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఢాకునాయక్‌తో కలిసి ధనియాలగుట్ట శ్మశానవాటికను కార్పొరేటర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న కాపలాదారుతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీసీ ఢాకునాయక్‌తో కలిసి కార్పొరేటర్ మాట్లాడారు. స్మశానవాటిక నిర్వహణను పర్యవేక్షిస్తున్న సంస్థ వైదొలిగిందని, ,త్వరలో నిర్వహణ కోసం టెండర్లను పిలుస్తామన్నారు. అప్పటి వరకు స్థానిక జీహెచ్ఎంసీ అధికారులు శ్మశానవాటిక నిర్వహణను పర్యవేక్షిస్తారని చెప్పారు. శ్మశానవాటికలో కొనసాగుతున్న వ్యభిచార కార్యకలాపాలపై కాంగ్రెస్ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేశ్ శనివారం జోనల్ కమిషనర్ రవికిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో శ్మశానవాటికను సందర్శించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులతో పాటు బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, నరేష్, రఘునాథ్, విజయకుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాగంటి వజ్రనాథ్

## కార్యకర్తలకు అండగా ఉంటా

● బీఆర్ఎస్ నేత మాగంటి వజ్రనాథ్

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ నేత మాగంటి వజ్రనాథ్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి 15 ఏళ్లుగా నిర్విరామంగా సేవ చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, అలాంటి వారికి మాగంటి కుటుంబం, పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో 35 బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్‌కు ఏఐడీఎస్‌ఓ మద్దతు

ఖైరతాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌రాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ, విద్యాసంస్థల సమాఖ్య సెప్టెంబర్ 15 నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌కు ఏఐడీఎస్ఓ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కళాశాల యాజమాన్యాల వేధింపులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. నాలుగైదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదివేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సూత్ర ఫెస్టివ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రదర్శనలో సందర్శకుల సందడి

బంజారాహిల్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి సీజన్ మొదలైంది. సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండడంతో సంప్రదాయం ఉట్టిపడేలా ఫ్యాషనబుల్‌గా ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ తాజ్‌కృష్ణలో సూత్ర పేరిట ఫెస్టివ్ ప్రదర్శన శనివారం మొదలైంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషకంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుందని వారు చెప్పారు.

## మహిళతో అసభ్య ప్రవర్తన

హైటెక్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వివాహిత మహిళ పట్ల గుర్తు తెలియని యువకులు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున జరిగింది. ఎస్ఐ రాఘవేంద్రగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన శ్రీధర్, కమృద్దీన్ దంపతులు మైండ్‌స్పేస్ సమీపంలోని గౌర వద్ద మిత్రులను కలిసేందుకు వచ్చారు. అదే సమయంలో ముగ్గురు యువకులు శ్రీధర్ కారును అడ్డుకున్నారు. అంతే కాకుండా శ్రీధర్ భార్య పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం టెండర్లలో గౌడన్నలకు 25% రిజర్వేషన్

● వక్తల డిమాండ్ ● సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం



సమావేశంలో అభివాదం చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలలో కల్లుగీత సొసైటీలకు 25 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలన్నారు. తాటి చెట్ల పైనుంచి పడి మరణించిన వారికి, దివ్యాగులకు పది లక్షల ఎక్స్ గ్రేషియాను వెంటనే ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 13 కోట్ల 95లక్షలను విడుదల చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కల్లుగీత సొసైటీకి ఇవ్వాలని, చెట్ల పెంపకానికి ప్రభుత్వం సహకరించాలని వారు అన్నారు. 50 సంవత్సరాలు పైబడిన కల్లుగీత వృత్తిదారులకు నెలకు ఐదువేల రూపాయలు పెన్షన్ తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గౌడన్న మీద కత్తి పెడుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. కల్లుగీత వృత్తిని నిషేధించే కుట్ర జరుగుతోందని బాలరాజ్‌గౌడ్ ఆరోపించారు. సమావేశంలో బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, బార్, రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, శ్రీశైలం గౌడ్, ప్రభాకర్‌గౌడ్, నాగేశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

# పేదల కోసం తపించే వ్యక్తి డా.రవీందర్‌గౌడ్

● ఎమ్మెల్యే దానం నాగేందర్



డాక్టర్ రవీందర్‌గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నాగేందర్

అమీర్‌పేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవే లక్ష్యంగా నిత్యం ప్రజల కోసం పరితపించే ప్రజా వైద్యుడు డా.రవీందర్ గౌడ్ అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌గౌడ్ కొనియాడారు. బల్కంపేటలో శనివారం శంకర నేత్రాలయ ఆస్పత్రిని నిర్వాహకుడు డా. రవీందర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పలు రకాల లేజర్ యంత్రాలు, ఏ-స్కాన్ సెంటర్, ఆప్టికల్స్, వెయిటింగ్ రూమ్, మెడికల్ స్టోర్ తదితర గదులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేందర్‌గౌడ్ మాట్లాడారు. అంధత్వ నివారణ కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకున్న ఆదర్శనీయుడు రవీందర్‌గౌడ్ అని అన్నారు. 2005 సంవత్సరం నుంచి సుమారు 3 వేల ఉచిత క్యాంపులు నిర్వహించి 3 లక్షల మందికి కంటి పరీక్షలు చేయడంతో పాటు 30 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయడం అభినందనీయమన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు ఆస్పత్రికి వచ్చిన వారికి భోజనం, ఉచిత రవాణా కల్పించిన గొప్ప వ్యక్తి రవీందర్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ శంకర నేత్రాలయ ఆస్పత్రిని సందర్శించి కంటి పరీక్షలు చేయించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేణుగోపాలచారి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## అధికారుల వేధింపుల నుంచి కాపాడండి

● తెలుగు లెక్చరర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న తెలుగు లెక్చరర్ సంజీవరెడ్డి

పంజాగుట్ట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. తనను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు లెక్చరర్ సంజీవరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వాటన్నింటిని కలిపి బుక్‌లెట్ రూపొందించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, రిటైర్డ్ లెక్చరర్ హరిహరనాథ్‌గుప్త, హైకోర్టు న్యాయవాది రామ్‌నరేష్ కుమార్, సామాజిక కార్యకర్తలు నర్సింలు, రమేష్‌లతో కలసి ఆయన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఇంటర్ విద్యా వ్యవస్థకు చెందిన ఒక ప్రిన్సిపాల్, ఒక జిల్లా అధికారి, ఒక ఆర్జేడీలు వారి అధికారాన్ని వాడుకుంటూ తనను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. వారి వేధింపుల నుంచి తనను కాపాడాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు.

## 17న జాతీయ జెండా ఎగురవేయాలి

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న ప్రతి పోలింగ్ బూత్‌లో జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సాగర్ సొసైటీలోని బీజేపీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ డివిజన్ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయిలో జెండా ఆవిష్కరణ పూర్తయిన వెంటనే పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భోజిరెడ్డి, నీరజముదిరాజ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ఫాతిమా నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆర్థిక సహకారంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్షల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ వైద్యం పొందలేని పేద ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి త్వరలో క్యాటరాక్ట్ సర్జరీలను చేయనునట్లు ఆయన తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న ఏకేవై ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏకేవై ఫౌండేషన్ సభ్యులు, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీశంకర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం సికింద్రాబాద్ అధ్యక్షుడు మోసిన్ ఖురేషి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, ఫాతిమానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు అండగా ఉంటా

బంజారాహిల్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గురుబ్రహ్మనగర్‌లోని గుడిసె వాసులకు అండగా ఉంటానని కార్పొరేటర్, టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి హామీనిచ్చారు. నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌కు చెందిన గిరిజనులు శనివారం ఆమెను తన కార్యాలయంలో కలిశారు. రోడ్డు కోసం రెవెన్యూ అధికారులు తమ గుడిసెలను తొలగించాలని చెబుతున్నారని, తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. స్పందించిన కార్పొరేటర్ గుడిసె వాసులకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీనిచ్చారు. బస్తీలో ఆదివారం పర్యటించిన తర్వాత రెవెన్యూ అధికారులతో మాట్లాడతానని చెప్పారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బేగంపేట (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కృష్ణ జ్యువెలరీ మేనేజర్ శరత్‌బాబు అన్నారు. రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో కృష్ణ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో కలిసి ఏరియా ఆపరేషన్ మేనేజర్ శరత్‌బాబు పలు మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని శరత్ అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీకర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు సురేందర్, సునీత, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కారులో తిరుగుతూ ఎండీఎంఏ విక్రయం

● ఇద్దరి అరెస్ట్

● 14.38 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కారులో తిరుగుతూ ఎండీఎంఏ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 14.38 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌పేట ప్రాంతంలో ఉంటున్న భరత్‌తుర్కల్ (50), కొనిపట్ల కృష్ణ (43)లు ఎండీఎంఏ విక్రయాలు చేస్తున్నారు. వీరు ఢిల్లీకి చెందిన మహ్మద్ షాజీబ్ నుంచి కొని, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బంజారాహిల్స్ ప్రాంతంలో ఎండీఎంఏ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టారు. ఎండీఎంఏ విక్రయించేందుకు కారులో వచ్చిన భరత్ తుర్కల్, కృష్ణలను పోలీసులు అరెస్ట్ చేసి రెండు మొబైల్స్, కారు, 14.38 గ్రాముల ఎండీఎంఏ, 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

### గంజాయి విక్రయిస్తూ నలుగురు..

గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చర్లపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న లవకుమార్ (24) ఉమాశంకర్ షాలను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బైక్, సెల్ ఫోన్లు, 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో లక్డీకాపూల్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ అమ్జద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 520 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ధీరజ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ

హైటెక్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును తెంచుకుని వెళ్లిన సంఘటన మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగింది. డీఐ విజయ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌కు చెందిన లక్ష్మి(65) మాదాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంటులో పనిచేస్తుంది. ఉదయం 11.30 ప్రాంతంలో పని పూర్తయిన తర్వాత సిగ్మా ఆస్పత్రి వద్ద నుంచి విఠల్‌రావు నగర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తుంది. గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి నడుచుకుంటూ వచ్చి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని వెళ్లాడు. తులం బంగారంతో పుస్తెలతాడు చేయించుకున్నానని బాధితురాలు తెలిపిరు. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## అదుపు తప్పి కారు బోల్తా

బంజారాహిల్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన కారు బోల్తా పడింది. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున ఓహ్‌రీస్ పెట్రోల్ బంకు వద్ద జరిగింది. ఆసీఫ్‌నగర్‌కు చెందిన షేక్ జుబేర్ అహ్మద్ కెనడా నుంచి వస్తున్న సోదరిని తీసుకువచ్చేందుకు కారులో బయలుదేరాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లో ఉన్న మరో సోదరిని కారు ఎక్కించుకున్నాడు. అనంతరం ఓహ్‌రీస్ వద్ద పెట్రోల్ కోసం కారు యూటర్న్ తీసుకున్నాడు. ఎదురుగా మరో వాహనం ఉండడంతో తప్పించేందుకు హ్యాండ్ బ్రేక్ వేశాడు. దీంతో కారు రెండు పల్టీలు కొట్టి బోల్తా పడింది. జుబేర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

● దళిత సేత రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు గంటా మల్లేష్

ఎర్రగడ్డ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతమైన వారిగా తీర్చిదిద్దె ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు గంటా మల్లేష్ అన్నారు. ఎర్రగడ్డలోని సుల్తాన్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. విద్యార్థులను సన్మార్గంలో పెట్టడానికి ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి పని చేస్తారని మల్లేష్ అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం రూస్సీరాణి, దళితసేన రాష్ట్ర కార్యదర్శి రాజేష్, హైదరాబాద్ జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన రోడ్లతో అవస్థలు

## మూన్నాళ్ల ముచ్చటగా కంటోన్మెంట్ రోడ్లకు మరమ్మతులు

**అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి**


బాపూజీ నగర్ ప్రధాన రహదారిలో వేసిన ప్యాచ్ వర్క్ దుస్థితి


తిరుమలగిరి కంటాబస్తీ రోడ్డుపై ఏర్పడిన గుంత


మహాత్మానగర్‌లో సిగ్నల్ వద్ద మరమ్మతుల మరుసటి రోజు ఏర్పడిన గుంత

సికింద్రాబాద్, బోయినపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా రోడ్లకు మరమ్మతులు చేస్తే కొద్ది రోజులైనా బాగుంటాయి. ఈ మరమ్మతు పనుల వల్ల గుంతల మయమైన రోడ్ల నుంచి కొద్ది రోజులైనా ఉపశమనం లభిస్తుంది. కానీ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఇలా మరమ్మతులు చేసి వెళ్లారో, లేదో కొద్ది గంటల్లోనే సమస్య మొదటికొచ్చేసింది. అధ్వాన రోడ్లతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి ఫలితంగా ప్రజలకు అధ్వాన రోడ్ల శాపం నుంచి విముక్తి కలగడం లేదన్న అభిప్రాయం సర్వత్రా వినవస్తోంది. బోయినపల్లిలోని బాపూజీనగర్, మహాత్మానగర్ రహదారుల మీదుగా నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారుల్లో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వీటిని పూడ్చివేయాలని కంటోన్మెంట్ బోర్డు అధికారులకు పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేయగా గణేష్ నిమజ్జనోత్సవ ఊరేగింపు సందర్భంగా పనులు చేపడతామని చెప్పారు. దాంతో అంతా ఆశగా ఎదురు చూశారు. అధికారులు చెప్పినట్టుగానే గణేష్ నిమజ్జనోత్సవ ఊరేగింపుకు ముందు ఈ గుంతలను పూడ్చివేశారు. అయితే ఈ గుంతల్లో భవన నిర్మాణాల వ్యర్థాలను పోసి, చేతులు దులుపుకోవడం చూసి స్థానికులు విస్తుపోయారు. కొద్ది గంటల్లోనే రోడ్లపై గుంతలు ప్రత్యక్షమయ్యాయి. అదేవిధంగా బోయినపల్లి మార్కెట్ యార్డ్, డైమాండ్ పాయింట్, సెంటర్ పాయింట్, కాంటబస్తీ రోడ్డు మార్గంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అయితే అధికారులు నామమాత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. దాంతో ఈ సమస్య మళ్లీ మొదటికొచ్చేసింది. అధికారుల నిర్వాకం, కాంట్రాక్టర్ల అత్యాశ కారణంగా ఈ గుంతలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారి, ప్రజల పాలిట శాపంగా పరిణమించాయి. ఇప్పటికైనా కంటోన్మెంట్ బోర్డు ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదలు ప్రత్యేక చొరవ తీసుకుని, గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### పనుల్లో అవినీతి



బోయినపల్లితోపాటు ఇతర ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మతు పనుల్లో అవినీతి జరిగిందనేది ఈ రోడ్లను చూస్తే అర్థమవుతుంది. రోడ్లకు మరమ్మతులు చేసిన రెండు రోజులకే అవి మళ్లీ పాడయ్యాయి. మరమ్మతులు చేసిన తర్వాత వెంటనే వర్షాలు కూడా పడలేదు. అయినా రోడ్లు పాడయ్యాయి. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. **- ప్రేమ్‌కుమార్, బాపూజీనగర్**

### సీఈఓ పరిశీలించాలి



బోయినపల్లి, బాపూజీనగర్, మహాత్మానగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లు గుంతలమయంగా మారాయి. నెలలు గడుస్తున్నా వీటికి మరమ్మతులు చేయలేదు. ఇటీవల గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా మరమ్మతులు చేశారు. అయితే రెండు రోజులకే రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. వీటిని కంటోన్మెంట్ సీఈఓ స్వయంగా పరిశీలించాలి. కారకులపై చర్యలు తీసుకోవాలి. **- బద్దం బల్వంత్‌రెడ్డి, బోయినపల్లి**


శాస్త్రినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బస్తీబాట

● ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బస్తీవాసుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుమలగిరి వార్డు-7 లాల్‌బజార్ శాస్త్రినగర్‌లో క్షేత్రస్థాయిలో బస్తీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఎన్నో ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్రినగర్ బస్తీ మొత్తం కలియతిరిగిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో బస్తీలు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సీఎం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరడంతో నిధులు కేటాయిస్తున్నారని, అధికారులతో సమన్వయం చేసుకొని మీ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ బస్తీ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన మహంకాళి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

## టైలర్లకు అండగా ఉంటా : తలసాని

మారేడుపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టైలర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావచ్చని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. శ్రీఉజ్జయిని మహంకాళి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇటీవల ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు శనివారం వెస్ట్ మారేడుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు కె.శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సభ్యులు ఆర్.శ్యామ్, జి.సతీష్, ఎస్.వెంకటేష్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

బౌద్ధనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ కోరారు. శనివారం బౌద్ధనగర్‌లో స్థానిక డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 17న ప్రధాని జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా పక్షం అభియాన్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పదిహేను రోజుల పాటు ప్రజలకు అభివృద్ధి, సామాజిక సేవా, ఆత్మనిర్భరత, ఎన్విరాన్మెంట్‌కేర్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అయ్యేలా చూడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీనితో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోచయ్య, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, నాయకులు కుమార్ నాగరాజు, చైతన్య, సుబ్బారావు, లడ్డు, జయంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


అనారోగ్యంతో కారులో కోర్టుకు వచ్చిన ఓ బాధితుడి నుంచి కేసు విషయాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి షౌకత్ జాహాన్ సిద్దిఖ్యా

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● షౌకత్ జాహాన్ సిద్దిఖ్యా

అడ్డగుట్ట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులు ఉంటే రాజీకి రావాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు 12వ అదనపు చీఫ్ మహిళా న్యాయమూర్తి షౌకత్ జాహాన్ సిద్దిఖ్యా అర్జీదారులకు సూచించారు. ప్రపంచ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ సివిల్ కోర్టులో పలు పెండింగ్ కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్ కేసులు ఉంటే వెంటనే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు 99 కేసులు పెండింగ్ కేసుల్ని పరిష్కరించారు. అనారోగ్యంతో ఉన్న ఓ బాధితుడు కోర్టుకు కారులో రావడంతో ఆమె నేరుగా బయటికి వచ్చి అర్జీదారుడితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సివిల్ కోర్టు 2వ సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్ కుమార్, 10వ అదనపు చీఫ్ జడ్జి డాక్టర్ కే.ప్రసాద్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు అన్నపూర్ణ, అంజయ్య, శిరీష, సౌమ్యలు పాల్గొన్నారు.

## 4,237 కేసుల పరిష్కారం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లోక్ అదాలత్‌లో భాగంగా సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం 4237 కేసులు పరిష్కారం అయ్యాయని అధికారులు తెలిపారు. రైల్వే యాక్ట్ ప్రకారం శనివారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. కేసుల పరిష్కారంలో భాగంగా రూ.4.72 లక్షలు పరిహారంగా చెల్లించారు. కాజీపేటలో 4211 కేసులు, నాంపల్లి ఎక్సైజ్ కోర్టులో 13 కేసులు పర్లీ కోర్టులో మరో 13 కేసులు పరిష్కారమైనట్లు ఐఆర్‌పీఎస్ఎస్ డివిజన్ సెక్రటరీ అలకుంట నవీన్ కుమార్ తెలిపారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

## జాబ్‌మేళాకు విశేష స్పందన

సికింద్రాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చదివిన చదువుకు తగిన ఉద్యోగం సంపాదించడానికి నిరుద్యోగ యువత పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలోనే ప్రభుత్వ విభాగాలు, ఆయా విద్యాసంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేస్తున్న 'జాబ్‌మేళా'లు కూడా కిటకిటలాడుతున్నాయి. తాజాగా సికింద్రాబాద్ బాలంరాయిలోని డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్స్‌లో శనివారం టెక్స్ అకాడమీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. 22 కంపెనీలు, 45మంది రిక్రూటర్లు, ఐటీ, బీఎఫ్ఎస్ఐ, డిజిటల్ మార్కెటింగ్, మెడికల్ కోడింగ్, ఆటోసీఏడీ, బీపీఎం తదితర విభాగాల్లో అవకాశాలు అందించారు. ఆన్-ది-స్పాట్ ఇంటర్వ్యూలు, ప్లేస్‌మెంట్ ఆఫర్లు ఇచ్చారు. 520మందికిపైగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లు లభించాయని టెక్స్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ జహీరుద్దీన్ షేక్ తెలిపారు.

ఇప్పటి వరకూ 50వేల మందికిపైగా శిక్షణనిచ్చినట్టు వెల్లడించారు. రిక్రూటింగ్ భాగస్వాములుగా పెట్రోకాన్ ఇంజనీర్లు, క్యామెల్ క్యూ సాఫ్ట్‌వేర్, జెనెసిస్ ఇన్ఫోఎక్స్, సువిధా సాఫ్ట్‌వేర్, కపిల్ ఐటీ, సాఫ్ట్‌పాల్, ఐజెబ్రా, ఏఐ, అభిరాం ఐటీ సొల్యూషన్స్ తదితర కంపెనీలు ఉన్నాయని ఆయన మీడియా సమావేశంలో వివరించారు.


భోలక్‌పూర్‌లో జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ముషీరాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. శనివారం భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, పార్టీ సీనియర్ నాయకుడు నిజాంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ బహిరంగ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త బోధనలు శాంతి, దయాగుణాన్ని ప్రసాదిస్తాయని అన్నారు. ఉత్సవాలను, ర్యాలీలను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, పార్టీ సీనియర్ నాయకులు రహీం, లోకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : మాజీ ఎంపీ

ముషీరాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహద పడుతుందని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్‌తో కలిసి అంజన్‌కుమార్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కావల్సిన నిధులను అందజేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, పార్టీ నాయకులు రహీమొద్దీన్, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగపాక వెంకట్, అభిషేక్ కెనడీ, షాంద్‌ఖాన్, ఫయాజ్, వేణుగౌడ్ పాల్గొన్నారు.


లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.కిరణ్ కుమార్, న్యాయవాదులు

## లోక్ అదాలత్‌కు విశేష స్పందన

● 26 బెంచ్‌ల్లో విచారణ.. 62 వేల కేసుల పరిష్కారం

● కక్షిదారులకు రూ.95.02 లక్షల పరిహారం

కుషాయిగూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు పరిధిలో నిర్వహించిన లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 26 బెంచ్‌ల్లో చేపట్టిన విచారణలో 151 సివిల్ కేసులు, బ్యాంకులు/బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 298 ప్రీ-లిటిగేషన్ కేసులతో పాటు 62,103 వివిధ రకాల క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు వెల్లడించారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా ఛైర్మన్ ఎస్.ఎన్.శ్రీదేవి లోక్ అదాలత్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్ కుమార్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి.తిరుపతి, ఇతర న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.అమర్‌నాథ్ రెడ్డి, ఇతర ప్రతినిధులు, న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్, పోలీసు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

బౌద్ధనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ ఆర్ట్స్ కాలేజీ టర్నింగ్ పాయింట్ వద్ద ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామ చందర్ తెలిపారు. సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ సహకారంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు వైద్యశిబిరం ఉంటుందని, నిపుణులైన వైద్యుల బృందంతో వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. బౌద్ధనగర్, పార్శీగుట్ట, సీతాఫల్‌మండి, మాణికేశ్వరినగర్, చిలకలగూడ, నామాలగుండు, తదితర ప్రాంతాలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9573209409 ఫోన్‌లో సంప్రదించి వివరాలను తెలుసుకోవచ్చునన్నారు.

## 8వ వేతన సంఘం ప్రక్రియను వేగవంతం చేయండి

చిలకలగూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల సవరణకు 8వ వేతన సంఘం అమలు ప్రక్రియ వేగవంతం చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌సీ రామకృష్ణాచార్యులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేతన సంఘం అమలుకి మూడునెలల కాలమే గడువు వుందని ఇంతవరకు ఛైర్మన్, కమిటీ సభ్యులు పేర్లు, విధి విధానాలు ప్రకటించలేదని తక్షణమే వేతన సంఘం అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పెన్షనర్లకు అన్యాయం జరుగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌బాగ్ రైల్వే స్టేషన్ సాధన సమితి సభ్యులు

## మల్కాజిగిరి అభివృద్ధికి నిధులు కేటాయిస్తా

● ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ ఆధ్వర్యంలో జడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు నూర్ అహ్మద్‌తో పాటు ఆనంద్‌బాగ్ రైల్వే స్టేషన్ సాధన సమితి సభ్యులు ఎంపీ ఈటలను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరిలో ఆనంద్‌బాగ్ రైల్వే స్టేషన్ ఎంఎంటీఎస్ ప్లాట్ ఫాం పనులకు ఎంపీ నిధుల నుంచి నిధులు ఇవ్వాలని కోరగా అందుకు ఎంపీ తన నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆనంద్‌బాగ్ రైల్వేస్టేషన్ సాధన సమితి సభ్యులు శాస్త్రి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తరుణ్ ఎన్‌క్లేవ్‌లో సమస్యలు పరిష్కరిస్తా

నేరేడ్‌మెట్ సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినాయకనగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీలోని తరుణ్ ఎన్‌క్లేవ్‌లో కార్పొరేటర్ కాస్యం రాజ్యలక్ష్మి అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ దీపాలు, దోమల బెడద, పారిశుధ్య సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు కాలనీ అసోసియేషన్ ద్వారా విన్నవించారు. వెంటనే కార్పొరేటర్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌తో మాట్లాడి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ పెంచాలని చెప్పారు. ఎంటమాలజీ ఏఈ వనజతో మాట్లాడి దోమల బెడద సమస్య పరిష్కరించాలని చెప్పారు. అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామన్నారని ఆమె చెప్పారు.

## నేడు పఠాన్‌బస్తీలో ఉచిత మెగా వైద్యశిబిరం

ముషీరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలోని ఐషా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ప్రోకేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫర్వేజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా ఐశ్వర్య

ముషీరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగానగర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ ఐశ్వర్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.




ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో మురళీకృష్ణ

## ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ

అల్వాల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ మండల ఎంఈవో కార్యాలయంలో అల్వాల్ మండలంలోని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులకు శనివారం ట్రస్మా సహకారంతో ఒక రోజు ఉపాధ్యాయ శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్వాల్ మండల ఎంఈవో మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో 50 పాఠశాలలకు చెందిన ప్రాథమిక, హైస్కూల్‌కు చెందిన 430 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు.



## హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్వాగతం

మల్కాజిగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మల్కాజిగిరిలో శనివారం రైలు బస్సు ప్రయాణికుల సంఘ సభ్యులు, జడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు నూర్ అహ్మద్‌లు ఘనస్వాగతం పలికారు. ఇటీవల జరిగిన సమావేశంలో రైల్వే అధికారుల దృష్టికి మల్కాజిగిరి మీదుగా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక నిముషం పాటు స్టాప్ ఇవ్వాలని కోరిన విషయం విదితమే. ఇందులో భాగంగా సుమారు ఎనిమిది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మల్కాజిగిరిలో నిలుపుదల చేయనున్నారు. హైదరాబాద్-హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం సాయంత్రం ఘనస్వాగతం పలికారు. ఇందుకు సహకరించిన రైల్వే అధికారులకు నూర్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ శ్రీనివాసరావు, ప్రయాణికుల సంఘం ప్రతినిధులు వీరస్వామి, భరద్వాజ్, హసీనా, శంకర్‌రావు, వెంకటేష్‌చారి, సత్యమూర్తి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.


మల్కాజిగిరిలో హిసార్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలుకుతున్న రైలు ప్రయాణికుల సంఘం సభ్యులు